క్లుప్తంగా

నేడు ప్రజాప్రతినిధుల వీడ్కోలు సమావేశం

మునగాల : మండల ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం ఈనెల 4న ముగుస్తుండడంతో బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని మాజీ సర్పంచ్‌లు, ప్రస్తుత ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఆయా శాఖల అధికారులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఆలయంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న ఎన్‌ఆర్‌ఐ కోటేశ్వరరావు

చిలుకూరు : మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో జేష్ఠ మాసం చివరి రోజైన మంగళవారం ఎన్‌ఆర్‌ఐ అలసకాని కోటేశ్వరరావు దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి రజనీకాంత్ ఆచార్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం దాతను దేవాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొడారు వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో..


అన్నదానంలో పాల్గొన్న దాతలు, భక్తులు

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కొలువైన అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు గట్టు శ్రీనివాస్, గెల్లా రాజేంద్రప్రసాద్, కొల్లు వీరయ్యలు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దాతలు, ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ


పూజల్లో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరహ లక్ష్మీనర్సింహ వేణు గోపాలస్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి ఆకుపూజ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, ఆంజనేయస్వామికి పంచామృతాలు, 108 తమలపాకులతో అభిషేకం, ఆకుపూజ, గంధ సింధూరం, మన్యసూక్త పారాయణం, శ్రీరామ, ఆంజనేయ అష్టోత్తర శతనామావళి, అలంకరణ, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు ముడుంబై మనోహరాచార్యులు, హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది యరగాని కిరణ్‌గౌడ్, గోవిందరెడ్డి, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ


పండ్లు పంపిణీ చేస్తున్న దాతలు

మునగాల : మండలంలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో మంగళవారం మండలంలోని కలకోవకు చెందిన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి పనస విజయ్‌కుమార్-రవీన దంపతుల కుమార్తె రియావిజయ్ పుట్టినరోజు సందర్భంగా 25మంది వృద్ధులు, అనాథలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలకోవకు చెందిన బెల్లంకొండ ప్రశాంత్, బెల్లంకొండ అజయ్, వృద్ధాశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ ఉన్నారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకురాలు విజయమ్మ మాట్లాడుతూ.. ఆశ్రమానికి ఎవరైనా సహాయ, సహకారాలు అందించాలంటే 99894 56906ను సంప్రదించాలన్నారు.

ముక్కంటి మృతి తీరనిలోటు

గరిడేపల్లి : మండలంలోని వెలిదండ గ్రామానికి చెందిన సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు మీసాల ముక్కంటి(64) మృతి పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ గ్రామ కార్యదర్శి మేకల కనకారావు అన్నారు. మంగళవారం గ్రామంలో ముక్కంటి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ మాశెట్టి అంజయ్య, సీనియర్ నాయకులు సాంబయ్య, వల్లపుదాసు లచ్చయ్య, మీసాల నాగరాజు, వెంకటేశ్వర్లు, మంగమ్మ, సువార్త, మల్లమ్మ, కొమరయ్య ఉన్నారు.

అద్దె భవనాల్లో వసతిగృహాలు

- ఏటా రూ.రెండున్నర లక్షల అద్దెల చెల్లింపు
- అరకొర వసతులతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు


కొక్కిరేణిలోని అద్దె భవనంలో నిర్వహిస్తున్న ఎస్సీ బాలుర వసతిగృహం


రేపాలలో అద్దె ఇంట్లో కొనసాగుతున్న ఎస్సీ బాలుర వసతిగృహం

మునగాల : సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వసతిగృహాలు గత కొన్నేళ్లుగా అద్దె ఇళ్లల్లోనే, అరకొర వసతులతో కొనసాగుతున్నాయి. ఈ వసతిగృహాల్లో కనీస సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. సరైన స్నానాల గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడాల్సివస్తుంది. మండలంలో మొత్తం ఐదు సాంఘిక సంక్షేమ వసతిగృహాలు ఉన్నాయి. వాటిలో మండల కేంద్రంలో ఉన్న ఎస్సీ బాలికల, ఎస్సీ బాలుర వసతిగృహాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహం, మండలంలోని రేపాల, కొక్కిరేణి గ్రామాల్లో నిర్వహించే ఎస్సీ బాలుర వసతిగృహాలు అద్దె ఇళ్లల్లో కొనసాగుతున్నాయి. ఏళ్ల తరబడి ఇదే అద్దె ఇళ్లల్లో నిర్వహిస్తున్నారు. ఈ వసతిగృహాలలో ప్రస్తుతం 200మందికి పైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఈ ఇళ్లకు నెలకు రూ.20వేల చొప్పున ఏటా రూ.రెండున్నల లక్షల రూపంలో సాంఘిక సంక్షేమ శాఖ అద్దె రూపంలో చెల్లించాల్సి వస్తుంది. ఇప్పటికే లక్షల రూపాయలను అద్దె రూపంలో చెల్లించినట్లు రికార్డుల్లో ఉంది. ఈ వసతిగృహాలు పురాతన ఇళ్లల్లో నిర్వహించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనన్న భయాందోళనల మధ్య వార్డెన్లు, విద్యార్థులు గడుపుతున్నారు. వసతిగృహాలకు సొంత భవనాలు నిర్మించాలని పలుమార్లు లిఖితపూర్వకంగా అధికారులకు విన్నవించినప్పటికీ ఫలితం లేకపోయిందని పలు విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. ఇప్పటికైనా సాంఘిక సంక్షేమ శాఖ స్పందించి తక్షణమే వసతిగృహాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సొంత భవనాలు నిర్మించాలి



రేపాల, కొక్కిరేణి, మునగాలలో నిర్వహించే సాంఘిక సంక్షేమ వసతిగృహాలకు పక్కా భవనాలు నిర్మించాలి. ఏళ్ల తరబడి వసతిగృహాలుగా కొనసాగుతున్న ఈ ఇళ్లల్లో ఏప్రమాదమైన జరిగిందంటే సాంఘిక సంక్షేమ శాఖ, ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. విద్యారంగానికి ఏటా కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామని ప్రకటనలు చేస్తున్న ప్రభుత్వం ఆచరణలో అమలుచేయాలి.

– గుగులోతు శివ, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకుడు

మౌలిక వసతులు కల్పించాలి



మండలంలో నిర్వహిస్తున్న వసతిగృహాలు అద్దె ఇళ్లలో కొనసాగుతున్నాయి. వాటిలో సరియైన సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. యుద్ధప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించాలి. రానున్న విద్యాసంవత్సరం పూర్తయ్యే లోగా అద్దె ఇళ్లల్లో నిర్వహిస్తున్న వసతిగృహాలకు పక్కా భవనాలు నిర్మించాలి.

– గద్దం వినోద్, డీవైఎఫ్ఐ నాయకుడు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వినతి


తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

మునగాల : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు శివ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సమస్యలపై డిప్యూటీ తహసీల్దార్ బి.సత్యనారాయణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ నిర్లక్ష్యం మూలంగా పాఠశాలలు ప్రారంభమై 20రోజులు అవుతున్నప్పటికీ నేటికి విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందించలేకపోయారని అన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు అందించే సన్నబియ్యం నాణ్యత కల్గినవి ఇవ్వకపోవడంతో భోజనం రుచిగా ఉండడం లేదని, ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని, విద్యార్థులకు కనీస వసతులైన మరుగుదొడ్ల సౌకర్యం, మంచినీటి వసతి, తరగతి గదుల్లో బెంచీలు, ఫ్యాన్లు, లైట్లు, ఆట వస్తువులు లాంటి సౌకర్యాలు కల్పించాలని, ప్రైవేట్ పాఠశాలలో విచ్చలవిడిగా అధిక ధరలకు అమ్ముతున్న పాఠ్య, నోటు పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్, షూ, ఇతర సామగ్రిని నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు అమరోజు శివ, ముస్తఫా, వెంకీ, చందు తదితరులు పాల్గొన్నారు.

4న విద్యాసంస్థల బంద్

మఠంపల్లి : నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ ఈనెల 4న జరిగే కేజీ టూ పీజీ విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోతు చందర్‌రావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్ పరీక్షా ప్రశ్నాపత్రాలను లక్షల రూపాయలకు లీకేజీ చేసి 24లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఎన్‌టీఏ ఏజెన్సీ చెలగాటం ఆడిందన్నారు. దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నా దేశ ప్రధాని ఇప్పటి వరకు స్పందించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా నైతిక బాధ్యత వహిస్తూ నీట్ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) చైర్మన్ ప్రదీప్‌కుమార్‌జోషి రాజీనామా చేయాలన్నారు. మానిటరింగ్ చేయడంలో విఫలం చెందిన కేంద్రం వైఖరిని నిరసిస్తూ చేపట్టిన దేశ వ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు ప్రైవేట్ యాజమాన్యాలు, విద్యార్థులు స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు. ఆయన వెంట సంఘం నాయకులు గణేష్, నిఖిల్, సతీష్, ఉదయ్, అషర్ తదితరులు ఉన్నారు.

అధికారులు ప్రజా సమస్యలపై స్పందించాలి


మేళ్లచెరువు : వీడ్కోలు సభలో ఎంపీపీ దంపతులను సత్కరిస్తున్న ఉద్యోగులు

మేళ్లచెరువు : అధికారులు ప్రజా సమస్యలపై స్పందించి చొరవ చూపాలని, గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కొట్టె పద్మసైదేశ్వరరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సభ్యులు గ్రామాల్లో ఉన్న విద్యుత్, తాగునీరు, ఆరోగ్యం, రోడ్లు వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో ఎంపీడీఓ ఖాజా అస్గర్‌అలీ, జెడ్పీటీసీ పద్మ, వైస్ ఎంపీపీ గాయం గోపిరెడ్డి, ఎస్ఐ పరమేష్, ఏపీఎం శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్‌గౌడ్, ఏపీఓ శైలజ, ఎంఈఓ సైదానాయక్, పశువైద్యాధికారి ఉషారాణి, మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్, ఆర్ఐ వాసు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు..

పదవీకాలం ముగిసిన ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు వారికి శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

ప్రజాప్రతినిధులు అంకితభావంతో పనిచేయాలి


హుజూర్‌నగరరూరల్ : ఎంపీపీ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు


హుజూర్‌నగరరూరల్ : ప్రజాప్రతినిధులు అంకిత భావంతో పనిచేయాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ, జెడ్పీటీసీలను మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లావణ్య, మాజీ సర్పంచులు అన్నెం శిరీషాకొండారెడ్డి, నాగసైదయ్య, సుజాత, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్, సలీమారం జాన్, సైదులు, నాయకులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'ని ఆర్భాట కార్యక్రమంగా మార్చొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

నేరేడుచర్ల : మండలంలో ప్రతి సోమవారం చేపట్టే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రచార ఆర్భాట కార్యక్రమంగా మార్చొదని, ప్రజా సమస్యలు పరిష్కరించే ఒక వేదిక కావాలని బీజేపీ మండల అధ్యక్షుడు పార్తనబోయిన విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు, అధికారులు మారినప్పుడు కొత్తకొత్త పనులకు శ్రీకారం చుట్టి తరువాత వాటిని పట్టించుకోకుండా ఉండే పరిస్థితి ఉందని, ఇప్పుడు నిర్వహించే ప్రజావాణి ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలను అధికారులు స్వీకరించి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భూమి, పెన్షన్, రేషన్‌కార్డులు, ఇళ్లు, ఇళ్ల స్థలాలులాంటి వ్యక్తిగత సమస్యలతో పాటు రోడ్లు, కరెంటు, డ్రెయినేజీ తదితర సమస్యలు కూడా పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం వాటికి పరిష్కారం చూపకుండా సమస్యలు మరింత ఉత్పన్నమయ్యే విధంగా చూడవద్దన్నారు. ప్రజావాణికి నిజమైనా సార్థకత జరగాలంటే ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని, లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామన్నారు. ఆయన వెంట పార్టీ మండల ఉపాధ్యక్షుడు పల్లెపంగ వీరబాబు, చిలకరాజు కరుణాకర్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు చింతలచెరువు సతీష్, దళిత మోర్చా అధ్యక్షుడు ఉప్పెళ్లి ప్రవీణ్, యువ మోర్చా అధ్యక్షుడు సోమనబోయిన నవీన్, ఎస్టీ మోర్చా నాయకులు మాలోతు రాము నాయక్, కిరణ్ తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని 7న ధర్నా


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

కోదాడరూరల్ : ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణకై ఈనెల 7న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించతలపెట్టిన ధర్నాకు మాదిగలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని టీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బచ్చలకూరి నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని హుజూనగర్‌రోడ్‌లోగల అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఏబీసీడీ వర్గీకరణ చేపడతామని చెప్పి పదేళ్లు గడిచినా నేటికి అమలు చేయలేదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నపుడు ఏబీసీడీ వర్గీకరణకు సహకరిస్తామని తెలిపి నేడు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తూ మాదిగలను మోసం చేస్తుందన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగే దీక్షకు మాదిగ, మాదిగ ఉపకులాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు సిద్దెల రాంబాబు, కర్ల సుందర్‌బాబు, చీమ శ్రీను, ఇటికల మధు, హుస్సేన్, లాజర్, వేణు, గోపి, రవి తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం


చెక్కు అందజేస్తున్న అరుణ్‌కుమార్

హుజూర్‌నగర్‌రూరల్ : సీఎం రిలీఫ్ ఫండ్ పథకం నిరుపేదలకు వరంలాంటిదని హుజూర్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బూరుగడ్డలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.2లక్షల30వేల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో యరగాని భిక్షం, సోమగాని నాగరాజు, నాగయ్య, గోపి, నాగరాజు, లబ్ధిదారులు లక్ష్మమ్మ, నాగరాజు తదితరులు ఉన్నారు.

'రైతు భరోసా'పై సలహాలు, సూచనలు ఇవ్వాలి


మునగాల : సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సహకార సంఘం ఆడిట్ అధికారి పద్మ


హుజూర్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ కోటిరెడ్డి


నడిగూడెం : మాట్లాడుతున్న చైర్మన్ రామారావు

మునగాల : రైతు భరోసా పథకం అమలు కోసం రైతులు సలహాలు, సూచనలు ఇవ్వాలని జిల్లా సహకార సంఘం ఆడిట్ అధికారి, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎస్.పద్మ కోరారు. మంగళవారం మండలంలోని తాడువాయి సొసైటీ కార్యాలయంలో చైర్మన్ తొగరు సీతారాములు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం అమలు చేసే విధానం కోసం రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం రైతుబంధును రైతుభరోసాగా మార్చిందన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. రైతుభరోసా పథకం కేవలం సాగు, కౌలు రైతులకు మాత్రమే వర్తింపజేయాలన్నారు. దీంతో సొసైటీ ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, మాజీ జెడ్పీటీసీ కోల ఉపేందర్, రైతుసంఘం నాయకులు బుర్రి శ్రీరాములు, సొసైటీ సీఈఓ నాగేందర్, డైరెక్టర్లు, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైతుల అభిప్రాయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : రైతు భరోసా అమలుపై రైతుల నుంచి సేకరించిన అభిప్రాయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్, సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ షేక్ బడేసాబ్ అన్నారు. మంగళవారం చింతలపాలెం మండలంలోని దొండపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం పరిధిలోని గ్రామాల రైతుల నుంచి రైతు భరోసా పథకంపై అభిప్రాయాన్ని సేకరించారు. ఈ సమావేశంలో పలువురు రైతులు మాట్లాడుతూ.. 10ఎకరాలకు వరకు రైతు భరోసా ఇవ్వాలని కోరారు. వరిపంటకు ఇస్తున్నట్లు గానే ఈ ప్రాంతంలో పండించే పత్తి, మిర్చి పంటలకు కూడా మద్దతు ధరతో పాటు బోనస్ ఇవ్వాలన్నారు. పీఏసీఎస్ చైర్మన్ కె.కోటిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాజీ చైర్మన్ ఎస్.కొండారెడ్డి, ఎంపీటీసీ సంధ్యశేషు, డైరెక్టర్లు ఎం.నారాయణమ్మ, ఎం.కొండారెడ్డి, పి.మల్లయ్య, ఎ.కృష్ణమ్మ, కె.హట్యా, ఏఈఓ రియాజ్, సెక్రటరీ పి.రమేష్, విజయ్, అశోక్, రైతులు ఉన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు, కాగిత రామచంద్రాపురం, తెల్లబల్లి సహకార సంఘాలలో మంగళవారం రైతు భరోసా పథకం అమలుపై రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ 10ఎకరాల లోపు రైతులకు రైతు భరోసా వర్తింపజేయాలని అధికారులకు తెలిపారు. నడిగూడెం సహకార సంఘం చైర్మన్ కొల్లు రామారావు మాట్లాడుతూ.. రైతు పక్షాన ప్రభుత్వం నిలబడి పథకాలను అమలు చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి బి.రాజయ్య, జిల్లా సహకార సంఘం ఆడిటర్ శ్రీనివాస్, చైర్మన్లు కొల్లు రామారావు, గోసుల రాజేష్, వెంకటేశ్వర్లు, సీఈఓలు యలమందరావు, శ్రీనివాస్, బూత్కూరి వెంకటరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

'హలో మాదిగ చలో హైదరాబాద్' కరపత్రాలు విడుదల


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

కోదాడరూరల్ : హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో ఈనెల 7న నిర్వహించనున్న హలో మాదిగ చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాణాల అబ్రహం పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని చిమిర్యాలలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన విడుదల చేసి మాట్లాడారు. మాదిగ ఏబీసీడీ వర్గీకరణ చేపట్టేంత వరకు తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య అధ్యక్షత జరిగే ఈ కార్యక్రమంలో మాదిగ యువత, ఉద్యోగులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు నారకట్ల ప్రసాద్, అమరబోయిన సంజీవరావు, జయరాజు, పెసరమిల్లి రవీంద్ర, కల్యాణ్, లింగారావు, రాజా, చంద్రశేఖర్, సుందర్, బాబురావు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతి


వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

కోదాడరూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని కొమరబండ 11వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సామాజిక కార్యకర్త గోవిందా నవీన్ మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. తమ వార్డులో తాగునీరులేక ఇబ్బందులు పడుతున్నామని, డ్రెయినేజీల్లో మురుగు పేరుకపోయిందని, పారిశుద్ధ్య నిర్వాహణ అస్తవ్యస్తంగా తయారైందని, వీధి దీపాలు వెలగడం లేదని వారు వినతిలో పేర్కొన్నారు. అధికారులు స్పందించి వెంటనే ఆ పనులు చేపట్టాలని కోరా రు. కార్యక్రమంలో చింతా రామకృష్ణ, కందుల శ్రీరాములు, కూరపాటి కాంత్రికుమార్ తదితరులు ఉన్నారు.

ఆశవర్కర్లకు పనిభారం తగ్గించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌కె యాకూబ్

గరిడేపల్లి : ఆశవర్కర్లకు పనిభారం తగ్గించాలని, పెరిగిన పనికి తగిన పారితోషికం పేరుతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌కె యాకూబ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌ఎస్‌సీలో నిర్వహించిన ఆశవర్కర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆశవర్కర్లకు పనిభారం పెరిగిందని, పనికి తగిన వేతనం ఇవ్వడం లేదని అన్నారు. ప్రభుత్వ పరంగా ప్రతి పనికి వారితో చాకిరీ చేయించుకుంటూ అందుకు తగిన వేతనం ఇవ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటింటికీ తిరుగుతూ అన్ని రకాల ప్రభుత్వ సేవలు చేస్తున్నా కనీసం వారికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమన్నారు. సమావేశంలో ఉమా, భవానీ, రూప, నాగమని, జయమ్మ, గోవిందమ్మ, సుజాత, భూబమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నేరేడుచర్ల : తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో ఈనెల 4న జరిగే దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వాసా పల్లయ్య పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో వర్ధంతి సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. దొడ్డి కొమరయ్య వర్ధంతి సభలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హుస్సెన్, పీవైఎల్ జిల్లా నాయకులు వాస కరుణాకర్, నియోజకవర్గ నాయకురాలు సత్తెమ్మ, మరియమ్మ, నరసమ్మ, రంగయ్య, లక్ష్మయ్య, రజాక్, మల్లేశ్వరీ, లక్ష్మమ్మ, కిష్టమ్మ తదితరులున్నారు.

నేడు ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పాలకవీడు : మండలంలో తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్ నూతన భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరైనట్లు, ఆ నిర్మాణ పనుల శంకుస్థాపనకు బుధవారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రానున్నట్లు ఎంపీపీ భూక్యా గోపాల్, జెడ్పీటీసీ బుజ్జిమోతీలాల్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా పనులకు సంబంధించిన స్థలాన్ని వారు అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. వారి వెంట తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ లక్ష్మి, ఎస్ఐ లక్ష్మీనర్సయ్య, నాయకులు ఉన్నారు.

టీఎస్‌పీఎస్సీ ముట్టడిని విజయవంతం చేయాలి

చివ్వెంల : నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయాల పట్ల ఈ నెల 4న నిర్వహించే టీఎస్‌పీఎస్సీ ముట్టడిని విజయవంతం చేయాలని సేవాలాల్ సేనా రాష్ట్ర కో కన్వీనర్ ధరావతు రాజేష్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. గ్రూప్ 2, 3లలో ఉద్యోగాల సంఖ్యను పెంచాలని, జీఓ నంబర్ 46 బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ముట్టడిలో నిరుద్యోగులు, సేవాలాల్ సేనా నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సంత వేలం వాయిదా

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో ప్రతి బుధవారం జరిగే వారాంతపు సంతకు మంగళవారం అనివార్య కారణాల వల్ల వేలం పాట నిర్వహించ లేదని మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9వ తేదీన యథావిధిగా సంత వేలం నిర్వహిస్తామని తెలియజేశారు.